సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ¦ 4 ¦ ఫిబ్రవరి ¦ 2024



విశ్వాసమా.. అవిశ్వాసమా..

ఇల్లెందు మున్సిపల్ చైర్మన్‌పై సోమవారం నాటి అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా, వీగుతుందా అనేది ఉత్కంఠగా మారింది. 8లో



ఎన్నికలకు సన్నద్ధం కండి..

లోక్‌సభ ఎన్నికలకు బీఆర్‌ఎస్ శ్రేణులు సన్నద్ధం కావాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎంపీ నామ పిలుపునిచ్చారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 18°

జిల్లాలో ఆదివారం పగటి పూట సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళలో కొంత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భ గుడి నుంచి ఊరేగింపుగా బేడా మండపానికి తీసుకొచ్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యా వాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. వారాంతపు సెలవు రోజులు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

తొలిరోజు 'గేట్' ప్రశాంతం



ధ్రువపత్రాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాంఇంజనీరింగ్ కళాశాలలో ఐఐటీ బెంగళూరు వారి ఆధ్వర్యంలో తొలిరోజు శనివారం జరిగిన గేట్ పరీక్ష ప్రశాతంగా ముగిసింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మొదటి సెషన్‌లో 45 మందికి 35 మంది, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగిన రెండో సెషన్‌లో 123 మందికి 101 మంది హాజరయ్యారు. రెండు విడతల్లో కలిపి 32 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

మేమెప్పుడూ ప్రజల పక్షమే

- రాహుల్ ప్రధాని కాడు.. కాంగ్రెస్ హామీలు అమలు కావు
- బీజేపీతో ఆ పార్టీవి చీకటి ఒప్పందాలు
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



భద్రాచలం సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన ఎంపీలు వద్దిరాజు, కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, హరిప్రియ తదితరులు

భద్రాచలం/బూర్గంపాడు/మణుగూరురూరల్ : అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బీఆర్‌ఎస్ ఎప్పుడూ ప్రజల పక్షమేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్రంలో హామీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కాడు.. తెలంగాణలో కాంగ్రెస్ హామీలు అమలు కావు అని ఎద్దేవా చేశారు. భద్రాచలం, పినపాక నియోజకవర్గ పరిధిలోని మణుగూరులో శనివారం నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రూ.14వేల కోట్లు అప్పు చేశారని, బీఆర్‌ఎస్ హయాంలోని అప్పులను అసెంబ్లీలో తప్పులతడకగా చూపించారని ఆరోపించారు. ప్రజల ముంగిట, బహిరంగ సభల్లో రేవంత్ రెడ్డి అనాగరికంగా, అసభ్యంగా మాట్లాడుతున్నారని, అయనకు మంచి మాటలు చెప్పాలని రాహుల్‌గాంధీని కోరారు. అమలు కానీ హామీలతో ప్రజలను ఎంతోకాలం మోసం చేయలేరని, కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజలు ఇప్పటికే తప్పు తెలుసుకున్నారని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెబుతారని అన్నారు. పెన్షన్ రూ.4వేలకు పెంచకపోగా, తాము ఇచ్చిన రూ.2వేలు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. 'భట్టి గారూ.. ఇదేనా మీరు తెచ్చిన మార్పు' అని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి ఆటో డ్రైవర్లను రోడ్డున పడేశారని, ఇప్పటికే 12 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. రుణమాఫీ, పంటలకు బోనస్ అంటూ రైతులను మోసం చేశారని విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ ఏళ్ల తరబడి చేసిన పోరాటాన్ని రేవంత్‌రెడ్డి నీరుకారుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వైఫల్యాల ను ప్రజల్లోకి తీసుకెళ్లి, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

బీజేపీతో చీకటి దోస్తీ..

బీజేపీ, కాంగ్రెస్‌లది చీకటి దోస్తి అని, దొంగే దొంగ..దొంగ అన్న చందంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభజనలో ఏడు మండలాలను ఏపీలో కలిపిన పాపం ఆ రెండు పార్టీలదేనన్నారు. ఇటీవలి ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ పరువు కాపాడిన భద్రాచలం నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలను గుండెల్లో పెట్టుకుంటామని అన్నారు. భద్రాచలంలో కరకట్ట అభివృద్ధికి రూ.39 కోట్లతో టెండర్ పిలిచా మని, పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు.

మెడికల్ కాలేజీ బీఆర్‌ఎస్ వరమే..

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో కొత్తగూడెం, నర్సంపేట, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో మెడికల్ కళాశాలల ఏర్పాటు బీఆర్‌ఎస్ వరమేనని ఎంపీ మాలోత్ కవిత అన్నారు. కేసీఆర్ ఆశీస్సులతో మహబూబాబాద్ ఎంపీగా రెండోసారి పోటీ చేస్తానని, తనను ఆశీర్వదించాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను గెలిపించిన రాష్ట్ర ప్రజలు పునరాలోచనలో పడ్డారని, మళ్లీ కేసీఆర్ నాయకత్వం వైపే చూస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ.. ఓటమి తాత్కాలికమేనని, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఒక్క బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేను అసెంబ్లీ గేటు తాకనివ్వనని ప్రగల్భాలు పలికిన నాయకుడికి భద్రాచలం ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారని అన్నారు. మాజీ విప్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆ హామీలు అమలు చేసేంతవరకు ఉద్యమించాలని అన్నారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. భద్రాచలం అభివృద్ధికి బీఆర్‌ఎస్ కట్టుబడి ఉందని, ఈ మేరకు అసెంబ్లీలో తన గొంతు వినిపిస్తానని అన్నారు. ఆయా సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ, తాటి వెంకటేశ్వర్లు, నాయకులు దిండిగాల రాజేందర్, మానే రామకృష్ణ, తాళ్లపల్లి రమేష్ గౌడ్, బొలిశెట్టి రంగారావు, తాండ్ర నరసింహారావు, కోటగిరి ప్రబోధ్ కుమార్, వాసు రాజు, సత్యాలు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మణుగూరులో హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

హరీశ్‌కు ఘన స్వాగతం

జిల్లాకు వచ్చిన హరీశ్‌రావుకు బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇరవెండిలోని తాళ్లూరి పంచాక్షరయ్య నివాసానికి వెళ్లిన హరీశ్‌రావును సత్కరించారు. జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరావు, రమణారెడ్డి, జలగం జగదీష్, వంశీకృష్ణ, సానికొమ్ము శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలి

- ఓటుహక్కుకు ఈనెల 6 వరకు గడువు
- కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉమ్మడి జిల్లాల శాసనమండలికి జరగనున్న ఎన్నికలకు పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల శనివారం ఒక ప్రకటనలో సూచించారు. 2020 నవంబర్‌కు ముందు డిగ్రీ, తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 22,510 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. ఫారం–18 ద్వారా అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓ కార్యాలయాల్లో లేదా ఆన్‌లైన్‌లో ఈనెల 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 24న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటిస్తామని, అభ్యంతరాలు తెలిపేందుకు మార్చి 14 వరకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యంతరాల పరిష్కారం అనంతరం ఏప్రిల్ 4న తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఓటు కోసం దరఖాస్తు చేసేవారు జిరాక్స్ పత్రాలపై డిజిగ్నేటెడ్ అధికారి లేదా గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించాలని సూచించారు.

శిశు మరణాలు అరికట్టండి

కొత్తగూడెంరూరల్: జిల్లాలో శిశు మరణాల నివారణకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష అన్నారు. తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులకు సకాలంలో ఇమ్యూనైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పిల్లలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలకు పాలు పట్టించడంలో జాగ్రత్తలు పాటించాలని తల్లులకు సూచించారు. సమావేశంలో పిల్లల వైద్య నిపుణులు వీరబాబు, ఫిజీషియన్ పుష్పలత, డీఐఓ బాలాజీ, ఇమ్యూనైజేషన్ అధికారి సీహెచ్ నాగభూషణం, డిప్యూటీ డెమో ఫైజ్‌మొయిద్దీన్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ..

పాల్వంచ : మున్సిపాలిటీ పరిధిలోని బొల్లేరుగూడెం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ శిరీష శనివారం తనిఖీ చేశారు. కేంద్రానికి తాళం వేసి ఉండడంతో వైద్యుడికి సమాచారం అందించగా, డాక్టర్ ప్రతాప్, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అనంతరం ఓపీ రికార్డులు పరిశీలించిన శిరీష.. ఒక వైద్యుడు, ఐదుగురు పారా మెడికల్ సిబ్బంది విధుల్లో లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓపీ రికార్డులు కూడా సక్రమంగా లేవన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శిరీష

12న జిల్లా స్థాయి పోటీలు

కొత్తగూడెంఅర్బన్ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈనెల 12న విద్యార్థులకు జిల్లా స్థాయిలో వివిధ పోటీలు నిర్వహిస్తామని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. తన కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీలు ఉంటాయని వివరించారు. అర్హులైన విద్యార్థులంతా పోటీలకు హాజరయ్యేలా చూడాలని జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులు, అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. తెలంగాణ శాస్త్ర, సాంకేతిక మండలి – పర్యావరణ పరిరక్షణ, శిక్షణ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో 12వ తేదీ ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పోటీలు జరుగుతాయని వివరించారు. ఒక్కో విభాగం నుంచి ముగ్గురు చొప్పున ఉత్తమ స్థానాలు పొందిన 12 మంది విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి చలపతి రాజు(9247296012)ను సంప్రదించాలని సూచించారు.



క్లుప్తంగా

అద్వానీకి భారతరత్న ప్రకటించడం హర్షణీయం

చుంచుపల్లి: ఉప ప్రధానిగా పనిచేసిన లాల్ కృష్ణ అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డును ప్రకటించడం పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.వి. రంగా కిరణ్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీ శ్రేణులను చైతన్య పరచడంలో ఆయన పాత్ర మరువలేనిదని, దేశ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

జేవీఆర్ ట్రస్ట్ ద్వారా మోటార్లు ఇస్తాం

మాజీ మంత్రి జలగం ప్రసాదరావు

అశ్వారావుపేటరూరల్: గిరిజన రైతుల పొలాలకు సాగునీరు అందించడం కోసం జేవీఆర్ ట్రస్ట్ ద్వారా మోటార్లు అందిస్తామని రాష్ట్ర మాజీ మంత్రి జలగం ప్రసాదరావు తెలిపారు. శనివారం మండలంలోని వినాయకపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బిల్లుడుగూడెం గిరిజన గ్రామంలో పర్యటించారు. గిరిజన రైతులకు మోటార్లు, పొలాలకు విద్యుత్ లైన్లను ఏర్పాటు చేసేందుకు పొలాలను పరిశీలించి మాట్లాడారు. ఎనిమిది మంది రైతులకు ట్రస్ట్ ద్వారా మోటార్లు అందిస్తామని తెలిపారు. గిరిజన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి విద్యుత్ లైన్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టాలని ఏడీఈ వెంకటేశ్వర్లుకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జూపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ నంద్రు రమేష్, జూపల్లి ప్రమోద్, బేతి సాంబశివరావు, బాబీ, నవీన్ ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల కేసు వాయిదా


సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన కేసు ఈనెల 17వ తేదీకి వాయిదాపడింది. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై కొత్తగూడెం కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు సంబంధిత కాంట్రాక్టర్లకు, సింగరేణి యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది. శనివారం వాయిదాకు కాంట్రాక్టర్లు, కొత్తగూడెం ఎల్ఈవో శంకర్‌రావు హాజరుకాగా, యాజమాన్యం నుంచి ఎవరూ హాజరు కాలేదు. దీంతో కేసు ఈ నెల 17వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారని, ఆ రోజు తప్పక హాజరుకావాలని యాజమాన్యం, కాంట్రాక్టర్లను ఆదేశించారని కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు రాసూరి శంకర్ తెలిపారు. మణుగూరు ఏరియా వైస్ ప్రసిడెంట్ వరదల సమ్మయ్య, బాషబోయిన రవికుమార్, రామవర సివిల్ విభాగం మహిళలు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ సీఎం బాధ్యత వహించాలి

టేకులగూడెం దాడి ఘటనపై మావోయిస్టు పార్టీ నేత సమత

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని టేకులగూడెం క్యాంపుపై జరిగిన దాడికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, హోంమంత్రి విజయ్‌శర్మతో పాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బాధ్యత వహించాలని మావోయిస్టు పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో సమత డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆమె లేఖ విడుదల చేశారు. జనవరి 30న బీజాపూర్ - సుకుమా జిల్లాల సరిహద్దులోని టేకులగూడెంలో పోలీసుల క్యాంపుపై పీఎల్‌జీఏ ద్వారా భీకరంగా దాడి జరిగిందని, ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారంటూ పోలీసులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులతో పోరాడుతున్న క్రమంలో బీజాపూర్ జిల్లా పడేడ గ్రామానికి చెందిన సెకండ్ కంపెనీ సెక్షన్ కమాండర్ మడివి మంగ్లు, సుకుమా జిల్లా పువ్వర్తి గ్రామానికి చెందిన పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ సభ్యుడు మడివి బొజ్జా మాత్రమే మృతి చెందారని తెలిపారు. ఆ దాడిలో ముగ్గురు పోలీసులు మృతిచెందగా వారి ఆయుధాలు, తూటాలు, కిట్ బ్యాగులను తమ పార్టీ సభ్యులు స్వాధీనం చేసుకున్నారని వివరించారు. తమ పార్టీకి నష్టం వాటిల్లితే ఎప్పుడూ గోప్యంగా ఉంచబోమని, పోలీసులే తప్పుడు లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. దాడిలో మరణించిన, గాయపడిన పోలీసులకు, వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నామని, విద్యావంతులైన యువత పోలీసు ఉద్యోగాల్లో చేరొద్దని ఆమె కోరారు.

ఆపన్న హస్తం అందించరూ..



అనారోగ్యంతో బాధపడుతున్న పాశం కళావతి

అశ్వాపురం: ఆర్థిక స్తోమతలేక చికిత్స పొందేందుకు ఓ మహిళ ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. మండల కేంద్రంలోని చవిటిగూడెం గ్రామానికి చెందిన పాశం కళావతి(55) ఊపిరితిత్తుల్లో రాళ్లతో ఇబ్బంది పడుతోంది. వైద్యం కోసం ఖమ్మంలో ఓ ఆస్పత్రిలో చేర్పించగా, ఆపరేషన్ ఖర్చులకు రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. ఆర్థిక స్తోమత లేక దాతల సహాయం కోసం ఎదురుచూస్తోంది. దాతలు ముందుకు వచ్చి తన తల్లి వైద్యానికి ఆర్థికసాయం అందించాలని కూతురు తోడేటి స్వరూప వేడుకుంటోంది. దాతలు స్వరూప 93926 57726 నంబర్‌కు ఫోన్‌పే ద్వారా ఆర్థికసాయం అందించాలని కోరుతోంది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

విశ్వాసమా.. అవిశ్వాసమా..?

- ఇల్లెందు మున్సిపాలిటీలో రేపు బల పరీక్ష
- చైర్మన్ అనుకూల, వ్యతిరేక కౌన్సిలర్లంతా క్యాంపుల్లోనే
- వారికి రక్షణ కల్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

ఇల్లెందు : ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై సోమవారం ప్రవేశపెట్టనున్న అవిశ్వాస పరీక్ష నెగ్గుతుందా.. వీడుతుందా అనేది ఉత్కంఠగా మారింది. అవిశ్వాస పరీక్షకు 24 మంది కౌన్సిలర్లలో మూడో వంతు మెజార్టీ ఉండాలి. అయితే గత నెల 18న 14 మంది కౌన్సిలర్లు గోవా క్యాంపునకు వెళ్లారు. చైర్మన్ డీవీని పదవీచ్యుతున్ని చేసే లక్ష్యంతో తమతో జట్టు కట్టిన ఒక్కో కౌన్సిలర్‌కు రూ.25 లక్షలు ఇచ్చేలా వ్యతిరేకవర్గంలో ఒకరు ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక డీవీకి అనుకూలంగా ఉన్న కౌన్సిలర్లు కూడా హైదరాబాద్‌లోనే మకాం వేశారు. ఇలా రెండు వర్గాల్లోనూ క్యాంప్ రాజకీయాలు జోరందుకున్నాయి.

మొదలైంది ఇలా..

గత నెల 11న మున్సిపాలిటీలోని 19 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ కలెక్టర్ ప్రియాంక ఆలకు నోటీస్ అందజేశారు. ఈనెల 5న అవిశ్వాసం నిరూపణ కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ నుంచి గతనెల 18న ఆదేశాలు వెలువడ్డాయి. ఆరోజే 15 మంది కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు.

బలాబలాలిలా ..

2020 జనవరిలో ఇల్లెందు మున్సిపాలిటీకి ఎన్నికలు జరగగా 24 వార్డుల్లో 19 బీఆర్ఎస్ గెలుచుకుంది. ఎన్డీ, సీపీఐ ఒక్కో స్థానం, టీఆర్ఎస్ రెబల్స్ మూడుచోట్ల గెలుపొందారు. వారిలో కడకంచి పద్మ, పత్తి స్వప్న వెంటనే బీఆర్ఎస్‌లో చేరారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ముందు రెబల్‌గా గెలిచిన మడత రమ కూడా గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న వారా రవి, పత్తి స్వప్న, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మొగిలి లక్ష్మి అంకెపాక నవీన్‌లు ఇటీవలి ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు.

పొంగులేటి చెంతకు వైస్ చైర్మన్..

అవిశ్వాస పరీక్ష సమీపిస్తున్న తరుణంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాషా శనివారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి చెంతకు చేరారు. ఇప్పటిదాకా అవిశ్వాసం కోసం ప్రయత్నిస్తున్న శిబిరంతో అంటకాగిన జానీపాషా 10 రోజుల క్రితం మంత్రి పొంగులేటిని కలిశారు. ఆనాటి నుంచి ఆయన ఊగిసలాటలో ఉన్నప్పటికీ శనివారం పొంగులేటి చెంతకు చేరారు. పొంగులేటి నుంచి అభయాస్తం లభిస్తే ఆయన డీవీకి అనుకూలంగా నిలిచే అవకాశం ఉంది. ఇక మరో కౌన్సిలర్ పత్తి స్వప్న కూడా తనకు మంత్రి పొంగులేటి మాటే వేదమని చెప్పారు. తాను కుటుంబసభ్యులతో కలిసి గోవాకు వెళ్లానే తప్ప చైర్మన్ డీవీకి వ్యతిరేకంగా కాదన్నారు. ప్రస్తుతం తాను ఏ శిబిరంలోనూ లేనని, పొంగులేటి సూచన మేరకు నడుచుకుంటానని స్పష్టం చేశారు.

కౌన్సిలర్లకు రక్షణ కల్పించండి..

అధికార పార్టీ నాయకులు, పోలీసులు తమను బెదిరిస్తున్నారని, అవిశ్వాస పరీక్షకు వెళ్లకుండా పాత కేసులు పెట్టి వేధిస్తున్నారని కొందరు కౌన్సిలర్లు హైకోర్టును ఆశ్రయించారు. తమకు ఇల్లెందు పోలీసులపై నమ్మకం లేదని, పటిష్ట బందోబస్తు మధ్య అవిశ్వాస పరీక్ష జరిగేలా చూడాలని కోరారు. దీంతో కౌన్సిలర్లందరికీ తగిన రక్షణ కల్పించాలని పోలీసు శాఖను హైకోర్టు శనివారం ఆదేశించింది.

'పార్లమెంట్'కు సన్నద్ధం కావాలి

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, పక్కన ఎంపీ నామా తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పార్లమెంట్ ఎన్నికలకు గ్రామస్థాయి నుంచి సిద్ధం కావాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని కారణాల వల్ల విజయం సాధించలేక పోయామని పేర్కొన్నారు. ఇది పార్లమెంట్ ఎన్నికలలో పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. కొత్త ఓటర్లకు 2014 ముందు జరిగిన తెలంగాణ ఉద్యమం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతోపాటు అదనంగా కాంగ్రెస్ ఇస్తామన్న పథకాలు వస్తాయనే ఆశతో కూడా ఓటర్లు మారారని తెలిపారు. కానీ పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు రాని వ్యతిరేకత రెండు మాసాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల వస్తోందన్నారు. చరిత్రను విస్మరిస్తూ కొన్ని మీడియా సంస్థలు విషప్రచారం చేయడం కూడా ఓటమికి కారణమని వ్యాఖ్యానించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఇటీవల మాట్లాడుతూ తెలుగుదేశం వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్యానించారని ఎద్దేవా చేశారు. కేంద్రం యాజమాన్యంలోకి కృష్ణా జలాలు వెళ్లడం దురదృష్టకరమని అన్నారు. ఎంపీ నామా నాగేశ్వరరావు ఈసారి కూడా పార్లమెంట్ ఎన్నికల్లో గెలుస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గాలిపటం వంటిదని, దారం తెగితే వాళ్లల్లో వాళ్లే దారం గుంజుకుంటారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్రంలో అన్ని రంగాల్లో కనీవినీ ఎరుగని అభివృద్ధి సాధించామని పేర్కొన్నారు. కృష్ణాజలాలపై పార్లమెంట్‌లో గళమెత్తింది బీఆర్ఎస్ మాత్రమేనని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణాలను విశ్లేషించుకుని పార్లమెంట్ ఎన్నికల్లో నామా నాగేశ్వరరావుకు అత్యధిక మెజారిటీ తీసుకురావాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకుడు ఎడవల్లి కృష్ణ కూడా మాట్లాడారు. కాగా వనమా రాఘవేందర్‌రావుపై సస్పెన్షన్ ఎత్తివేసి, తిరిగి పార్టీలోకి తీసుకోవాలని పలువురు కార్యకర్తలు డిమాండ్ చేయగా, ఈ విషయాన్ని అధినేత కేసీఆర్‌తో మాట్లాతానని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు మోరె భాస్కర్, అనుదీప్, రాజుగౌడ్, నవతన్, అన్వర్‌పాషా, కాసుల వెంకట్, బత్తుల వీరయ్య, సింధు తపస్వి, రుక్మాంగదర్ బండారి, సోని, చంద్రశేఖర్, మరి కృష్ణ పాల్గొన్నారు.

పామాయిల్ తోటను పరిశీలించిన మాజీ మంత్రి



పామాయిల్ తోటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి

సుజాతనగర్: సుజాతనగర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది జీవీకే మనోహర్ పామాయిల్ వ్యవసాయ క్షేత్రాన్ని మాజీ వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శనివారం సందర్శించారు. సాగులో తీసుకుంటున్న జాగ్రత్తలు, మెళకువలు, ఎరువుల యాజమాన్యం, మొక్కల సంరక్షణ తదితర అంశాలను వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పామాయిల్ సాగును ప్రోత్సహించినట్లు గుర్తుచేశారు. పామాయిల్ తోటలో అంతర పంటగా టమాట సాగు చేపట్టిన రైతు తాళ్లూరి పాపారావును మంత్రి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి నరేంద్రబాబు, జ్యోతి బసు, మేరెడ్డి జనార్దన్ రెడ్డి, న్యాయవాది మణిదీప్, జలగం యువసేన నాయకులు సయ్యద్ యాకూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అదే బాటలో కొత్తగూడెం...



అవిశ్వాస తీర్మానం కాపీని అందించిన కౌన్సిలర్లు(ఫైల్)

- అవిశ్వాస సమావేశానికి నోటీసు జారీ చేసిన కలెక్టర్
- 19న మున్సిపల్ కార్యాలయంలో బలపరీక్ష
- అసమ్మతివర్గ కౌన్సిలర్ల మంతనాలు!

కొత్తగూడెంఅర్బన్: ఇల్లెందు మున్సిపాలిటీ బాటలోనే కొత్తగూడెం పాలకవర్గం కూడా పయనిస్తోంది. చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిపై అవిశ్వాసం కోసం శనివారం కలెక్టర్ ప్రియాంక ఆల నోటీసు జారీ చేశారు. గత నెల 23వ తేదీన 22 మంది బీఆర్ఎస్, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం కాపీని అందించారు. ఈ క్రమంలో కలెక్టర్ నోటీసులు జారీ చేయగా, కాపీలను మున్సిపల్ సిబ్బంది కౌన్సిలర్లకు అందజేశారు. ఈ నెల 19న కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో బలపరీక్ష జరగనుండగా, చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్ భీమా శ్రీవల్లి వర్గం బలాబలాలు తేలనున్నాయి.

ఆదినుంచీ వివాదాలే..

మున్సిపాలిటీ పాలకవర్గం 2020లో ఎన్నికైనప్పటి నుంచీ వివాదాలు వెంటాడుతున్నాయి. చైర్‌పర్సన్ తమ వర్గానికి ఎక్కువ ప్రయోజనాలు చేకూర్చుతున్నారని, ఇతరుల వార్డులను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ కౌన్సిలర్లే పలుమార్లు కౌన్సిల్ సమావేశాల్లో గొడవలు చేశారు. అప్పటి నుంచి చైర్‌పర్సన్‌పట్ల వ్యతిరేకంగా ఉన్న కౌన్సిలర్లు ఐక్యమవుతూ అవిశ్వాసంపై అడుగులు వేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాస వ్యవహారం సాగుతుండటంతోపాటు భవిష్యత్ రాజకీయ ప్రయోజనాలను ఆశించి కౌన్సిలర్లు అవిశ్వాసం వైపు అడుగులు వేసినట్లు తెలుస్తోంది.

మ్యాజిక్ ఫిగర్ 19

కొత్తగూడెం మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాన కాపీని కలెక్టర్‌కు అందజేసిన మరుసటి రోజు నుంచి అసమ్మతి కౌన్సిలర్లు రహస్య ప్రదేశాల్లో సమావేశమవుతున్నారు. చర్చలు, మంతనాలు జరుపుతున్నారు. మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లు ఉండగా, కనీసం 19 మంది సభ్యులు ఉంటే అవిశ్వాసం నెగ్గుతుంది. ప్రస్తుతం అసమ్మతి వర్గంలో 22 మంది ఉండటంతో తాము తేలికగా బలపరీక్షలో నెగ్గుతామని అసమ్మతి వర్గంవారు భావిస్తున్నారు. మరోవైపు అసమ్మతి వర్గంలో 22 మంది ఉన్నా, వారిలో చాలా మంది తనతో టచ్‌లో ఉన్నారనే ధీమా చైర్‌పర్సన్ వ్యక్తం చేస్తున్నారు. ఏ కౌన్సిలర్ ఎవరి వైపు వెళ్తారో చివరి వరకు చెప్పలేని పరిస్థితులు నెలకొన్నది. బలపరీక్షకు ఇంకా 16 రోజుల సమయం ఉండగా, ఇప్పటినుంచే ఎవరికి వారు వ్యూహారచన చేస్తున్నారు. కౌన్సిలర్లు చేజారకుండా క్యాంపులకు సైతం వెళ్లే అవకాశాలున్నాయి.

భార్య, కుమారుడే హతమార్చారు...

అశ్వారావుపేటరూరల్: మద్యం తాగి దాడి చేస్తుండగా.. భార్య, కుమారుడు చేసిన ప్రతి దాడిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి సీఐ పెద్దన్న కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోనా భద్రం(72) కొంతకాలంగా మద్యం తాగుతూ భార్య రాములమ్మపై దాడి చేస్తూ హింసిస్తున్నాడు. వేధింపులు భరించలేక ఆమె సమీప గ్రామమైన అసుపాకలోని కుమార్తె వేముల విజయలక్ష్మి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం భద్రం అక్కడకు వెళ్లి దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో అక్కడకు వెళ్లిన కుమారుడు నరేష్ అడ్డుకునేందుకు యత్నించగా, అతనిపై కూడా దాడికి పాల్పడ్డాడు. దీంతో కోపోద్రిక్తులైన భార్య, కుమారుడు కర్రలతో దాడి చేయగా, భద్రం తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అక్కడే ఉన్న కుమార్తె కనీసం అడ్డుకోలేదు. కొద్దిసేపటి తర్వాత చికిత్స కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. మృతి చెందిన విషయాన్ని బయటకు పొక్కనీయకుండా మృతదేహాన్ని ఏపీలోని కొవ్వూరులో దహనం చేసేందుకు కారులో తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో అశ్వారావుపేటలో మృతుడి మేనల్లుడు గురుమూర్తి మృతదేహాన్ని పరిశీలించగా, గాయాలు ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ పెద్దన్న కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మాతృభాషను మరవొద్దు

'హార్వెస్ట్' వార్షికోత్సవంలో మంత్రి తుమ్మల



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కరస్పాండెంట్ రవిమారుత్

ఖమ్మం సహకారనగర్: తల్లిదండ్రులు పిల్లలకు ఇతర భాషలతో పాటు మాతృభాష అయిన తెలుగు నేర్పించడాన్ని మరవొద్దని రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మంలోని హార్వెస్ట్ విద్యాసంస్థల 22వ వార్షికోత్సవం శనివారం నిర్వహించగా.. మంత్రి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పోటీతత్వం, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానంలో మార్పులు వస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు కొత్త విధానాలు అందుబాటులోకి తీసుకురావడంలో హార్వెస్ట్ ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. అనంతరం హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ మాట్లాడుతూ హార్వెస్ట్ స్కూల్, టెండర్ రూట్ స్కూల్, హార్వెస్ట్ స్ప్రింగ్‌లీఫ్ ద్వారా ఇప్పటికే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తుండగా.. వచ్చే ఏడాది నుంచి సెడార్ వ్యాలీ స్కూల్‌లో మరింత మెరుగైన బోధన అందుబాటులోకి రానుందని తెలిపారు. ఆతర్వాత ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి మాట్లాడగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హార్వెస్ట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైలుకింద పడి ఆత్మహత్య

పాల్వంచ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని శేఖరం బంజర గ్రామానికి చెందిన జర్పుల మంగ్యా(50) కుటుంబ సభ్యులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆర్థిక పరిస్థితి కూడా సక్రమంగా లేదు. దీంతో మద్యం తాగి గాజులగూడెం సమీపంలోని రైల్వే ట్రాక్ బొగ్గు రైలు కింద పడి వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ బి.రాము సందర్శించి పోస్ట్‌మార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ఇద్దరు పిల్లలతో కలిసి శుక్రవారం రాత్రి నుంచి కన్పించడంలేదు. కరీంనగర్‌కు చెందిన గుర్రం సాయిరాం అనే వ్యక్తిపై తనకు అనుమానం ఉందని ఆమె భర్త శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

సుదిమళ్ల కార్యదర్శి గది సీజ్


ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీలో కార్యదర్శి గదిని శనివారం సీజ్ చేశారు. సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్యదర్శి నాగమణికి ఈ నెల 1న ఎంపీడీఓ మెమో జారీ చేయగా, తీసుకునేందుకు ఆమె నిరాకరించింది. దీంతో కార్యదర్శికి వాట్సాప్ ద్వారా పంపారు. శుక్రవారం కార్యాలయలంలో హాజరుగా, మెమోను గ్రామపంచాయతీ కార్యాలయంలో సిబ్బందికి అందజేశారు. ఈ క్రమంలో 2వ తేదీ నుంచి పది రోజులపాటు ఆమె సెలవు పెట్టగా ఎంపీఓ చి రంజీవి కార్యదర్శి గదికి తాళంవేసి సీజ్ చేశారు.

2.22 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



కొత్తగూడెం అర్బన్: వివరాలను వెల్లడిస్తున్న సీఐ మురళి



సుజాతనగర్ : వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: ఒడిశా నుంచి అక్రమంగా కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సీఐ మురళి వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పోలీసులు ఓల్డ్ బస్ డిపో వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు ఇన్నోవా వాహనంలో 110 ప్యాకెట్లలో 2.22 క్వింటాళ్ల గంజాయి తీసుకెళ్తుండగా గుర్తించి పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా మహారాష్ట్రకు చెందిన శ్రావణ్ బిష్ణోయ్, కైలాష్ బిష్ణోయ్‌ల ఆదేశాలతో రాజస్థాన్‌కు చెందిన సునీల్, సత్రమ్ అనే వ్యక్తులు ఒడిశాలోని సందీప్ మండల్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు తేలింది. గంజాయితోపాటు వాహనం, రెండు మొబైల్ ఫోన్లు, రూ. 1800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సునీల్, సత్రమ్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.55,59,500 ఉంటుందని సీఐ తెలిపారు.

సుజాతనగర్‌లో 9 కేజీలు...

సుజాతనగర్: చుంచుపల్లి తండాకు చెందిన ముగ్గురు యువకులు శనివారం ఏపీలోని చింతూరు నుంచి 9 కిలోల గంజాయిని బైక్‌పై హైదరాబాద్ తీసుకెళ్తుండగా సుజాతనగర్‌లో పోలీసులు పట్టుకున్నారు. కున్సో త్ ప్రదీప్, కున్సోత్ గణేష్‌లను అరెస్ట్ చేయగా, విజయ్ అనే యువకుడు పరారయ్యాడు. పోలీసులు వాహనం, గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ భద్రం, ఆర్‌ఐలు కాంతారావు, బాబు, పోలీస్ సిబ్బంది సీతారాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో 5.3 కేజీలు

ఇల్లెందురూరల్: అక్రమంగా బైక్‌పై రవాణా చేస్తున్న 5.3 కిలోల ఎండు గంజాయిని శనివారం మండలంలోని బొజ్జాయిగూడెం శివారు సమ్మక్క గద్దెల వద్ద ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఇల్లెందుకు చెందిన ప్రవీణ్, బర్మావత్ లోకేష్, ఖమ్మంకు చెందిన బొప్పన కిషోర్ ఆంధ్ర-ఒడిశా సరిహద్దు నుంచి గంజాయిని తీసుకొస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని సీఐ సర్వేశ్వర్ తెలిపారు. సీఐ ఎస్ఐ అనిల్, సిబ్బంది కరీం, సుధీర్, హరీష్ పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ పారామెడికల్ అల్, సిద్ధ, నేచురోపతి, యోగా పంచకర్మ యునాని ELe.Homeo ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్, ఫైర్ & సేఫ్టీ, హోటల్ మేనేజ్‌మెంట్, గోల్డ్ ఎప్రైజర్, ఫిషరీ. www.bssve.in అన్ని కోర్సులకు. ఫోన్: 99639 78632 [V- 2349]

■ One Sitting / Regular: 10th, Inter, NIOS, TOSS, APOSS, DEG, PG, Nagarjuna, SV, YVU, University, Guidelines for B.Tech failed students (KPHB) Ph: AES 9515390685, 9032284760 [H-801585]

Real Estate

■ ఖమ్మం మరియు హైదరాబాద్‌లో ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్స్, విల్లాస్, కమర్షియల్ షాపులు అమ్మిపెట్టబడును, కొనిపెట్టబడును. సం॥ కాట్రపల్లి నాగరాజ్-93993 42239. [M-1233773]

LEASE

■ ఖమ్మం NTR సర్కిల్ దగ్గర, రసపాక రెస్టారెంట్ వెనుకవైపు 266 చ॥గ॥ కమర్షియల్ ప్లాటు రెస్టారెంట్‌కు, కమర్షియల్ షాప్స్‌కు లీజుకు ఇవ్వబడును. సంప్ర. 90147 80260. [M-1167513]

TO-LET

■ ఖమ్మం, మెయిన్‌రోడ్, వైరా రోడ్‌కు 2nd Line, నిజాంపేట్‌లో గల H.No. 8-3-36, కమర్షియల్ గల ఇండిపెండెంట్ హౌస్ అద్దెకు ఇవ్వబడును. సెల్ : 80964 57478. [M-1167514]

■ ఖమ్మంలో నియర్ సుందర్ టాకీస్ రోడ్, భారత సీడ్స్ పైన 1st ఫ్లోర్ 1333 Sft. ఆఫీసులకు, ఇతరులకు కమర్షియల్, గోడౌన్స్ అద్దెకు/ లీజుకు ఇవ్వబడును. సంప్ర. 94921 65687. [M-1233753]

FLAT FOR SALE

■ కొత్తగూడెం, గౌతమ్‌నగర్ ఏరియాలో 3 అంతస్తుల బిల్డింగ్, 1వఫ్లోర్, 2వఫ్లోర్ అమ్మబడును. పడమర ముఖం కొత్త డబుల్ బెడ్‌రూం ప్లాట్లు కబోర్డ్స్ కలిగి ఉంది బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. 9398923124 [G-1432]

LAND FOR SALE

■ 6.20 ఎకరా పూర్తి ఆర్గానిక గా, సోలార్ ఫెన్సింగ్, 2 గదుల ఇల్లు ఉన్న మామిడి తోట అమ్మకానికి గలదు. @ పిండిపోలు తిరుమలాయ్ పాలెం. Ph: 9951625343, +919573517739 [HA-3587]

Services

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

ఓల్డేజ్ హోం

■ సాయి హోంకేర్ & ఓల్డేజ్: వృద్ధులకు, పేషంట్లకు అన్ని రకముల సేవలకు 24 గం. ఆటెండర్స్‌ను పంపగలము. (ఆయాలు, అటెండర్స్ కావలెను జీ+బో+వ (ఫ్రీ) ✆ 7569630177, 9398866009. [B-1206329]

TOURS & TRAVELS

■ సురేన్ టూర్స్ 5 జ్యోతిర్లింగాలు ముంబై, షిరిడీ మే 8న సంప్ర: శారదా మేనేజింగ్ డైరెక్టర్ 7702108471, 9440734701 [H-787717]

Wanted

■ Wanted Jr. Accountant : Tally Prime, Excel Exp. 1-2 years, Office Asst. : Online Tenders and DTP Work. Chakradhar Engg. Prakash Nagar, Khammam-94406 22069. [M-2835]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233772]

■ విజయవాడలో ఇంటివద్దనే వుండి పేషెంట్‌లను /పెద్దవారిని చూసుకొనుటకు అనుభవం వున్న M/F కేర్ టేకర్స్ / నర్సులు కావలెను. రూమ్+భోజనం + మంచి జీతం ✆ 91608 35559, 78158 35561 [B-624]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-801571]

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు, వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 20k ఫోన్: 8977639662/8977639663. [H-793685]

■ ఇంట్లో ఉండి బెడ్ పేషెంట్ లను చూసుకొనుటకు ఏ బాదర బందీ లేని (స్త్రీలు మాత్రమే) 40 సంవత్సరాల పైబడిన వారు వెంటనే కావలెను. మంచి జీతం + వసతి + భోజనం. సంప్ర: 9440734701, 7702108471 [H-787718]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యాభర్తలు & గార్డెన్ వర్క్ అవులను చూసుకొనుటకు కావలెను. ఫోన్: 9391086931, 9246585901. [HA-13030]

■ బాలాజీ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. బో+వ+జీ: 15-21 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 63010 53690, 92814 52843 [B-1239063]

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి

కేవలం రూ. 500/- మాత్రమే

(GST 5% అదనం)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

హైటెక్ మోసాల ఆటకట్టు

సైబర్ నిందితుడి వద్ద నేరాలపై శిక్షణ

- ఆపై సొంతంగా నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు
- డేటా ఎంట్రీ జాబ్స్ అంటూ నిరుద్యోగులకు వల
- తెలంగాణ సహా 25 రాష్ట్రాలలో మోసాలు
- రూ.100 కోట్లకు పైగా సొమ్ము వసూలు చేసిన ముఠా
- నలుగురు అంతర్రాష్ట్ర సైబర్ నిందితుల అరెస్టు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నిందితుడి వద్ద శిక్షణ తీసుకొని, ఆపై సొంతంగా నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి తెలంగాణ సహా దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ సైబర్ ముఠా గుట్టురట్టయింది. డేటా ఎంట్రీ జాబ్స్ పేరిట నిరుద్యోగులకు వల వేసి.. ఆపై కంపెనీ షరతులను ఉల్లంఘించారని పేర్కొంటూ నకిలీ లీగల్ నోటీసులు పంపించి బాధితుల నుంచి సొమ్ము వసూలు చేసిందీ గ్యాంగ్. తెలంగాణ, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, మహారాష్ట్ర వంటి


పోలీసుల అదుపులో నిందితులు

25కుపైగా రాష్ట్రాలలో 358 సైబర్ కేసులున్న ఈ ముఠా.. ఇప్పటివరకు సుమారు రూ.100 కోట్లకు పైగానే సొమ్ము వసూలు చేసినట్లు సైబరాబాద్ సైబర్ క్రైం డీసీపీ శిల్పవల్లి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..

టెలీ కాలర్‌గా పని చేసి..

గుజరాత్‌లోని సూరత్‌లో నకిలీ డేటా ఎంట్రీ కంపెనీలో దిండోలి ప్రాంతానికి చెందిన రాహుల్ అశోక్ భాయ్ భాస్కర్ టెలీ కాలర్‌గా పని చేశాడు. ఓ సైబర్ క్రైమ్ కేసు దర్యాప్తులో భాగంగా స్థానిక పోలీసులు కంపెనీ యజమాని నితీష్‌ను అరెస్టు చేసి, కాల్ సెంటర్‌ను మూసేశారు. కాల్ సెంటర్, డేటా ఎంట్రీ కార్యకలాపాలపై పట్టు సాధించిన రాహుల్.. తన స్నేహితులైన సాగర్ పాటిల్, కల్పేష్ థోరట్, నీలేష్ పాటిల్‌లను సంప్రదించి సైబర్ మోసాల గురించి వివరించాడు. ఈ నలుగురూ కలిసి సూరత్‌లో ఫ్లోరా సొల్యూషన్ పేరుతో నకిలీ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ పోర్టల్స్ నుంచి నిరుద్యోగుల డేటాను సేకరించి, వారికి వాట్సాప్ ద్వారా డేటా ఎంట్రీ జాబ్ సందేశాలను పంపించేవారు. ఆసక్తి కనబరిచిన వారికి జాబ్ లాగిన్ కోసం ఐడీ, పాస్‌వర్డ్ అందించేవారు.



నకిలీ లీగల్ నోటీసులతో బెదిరింపులు..

డేటా ఎంట్రీ పని పూర్తయ్యాక ఉద్యోగికి సొమ్ము చెల్లించకుండా కంపెనీ ప్రమాణాలకు తగిన స్థాయిలో డేటా ఎంట్రీ లేదని మాయమాటలు చెబుతూ సొమ్ము చెల్లించరు. దీంతో కొంతకాలం ఎదురుచూసిన ఉద్యోగికి డేటా ఎంట్రీ చేయడం మానేస్తాడు. అప్పుడే నిందితులు రంగంలోకి దిగుతారు. కంపెనీ నిబంధనలు, షరతులను ఉల్లంఘించారని పేర్కొంటూ నకిలీ లీగర్ నోటీసులను బాధితులకు వాట్సాప్, ఈ–మెయిల్ ద్వారా పంపించి బెదిరింపులకు తెగిస్తారు. నోటీసులు రద్దు చేసుకోవాలంటే చార్జీలను చెల్లించాల్సి ఉంటుందని చెబుతారు. ఈక్రమంలో సైబరాబాద్‌కు చెందిన ఓ బాధితుడు వీరి వలలో చిక్కి రూ.6.17 లక్షలు మోసపోయాడు. ఇప్పటికే ఈ ముఠాపై సైబరాబాద్‌లో 11 కేసులున్నాయి.

వేలాది బ్యాంకు ఖాతాల విశ్లేషణ..

బాధితులు పంపించిన సొమ్ము ఏ బ్యాంకు ఖాతాలు నుంచి ఎక్కడికి బదిలీ అయ్యాయో విశ్లేషించారు. ఇతరత్రా సాంకేతిక అంశాల ఆధారంగా నిందితులు రాహుల్, సాగర్, కల్పేష్, నీలేష్‌లు సూరత్‌లో ఉన్నట్లు గుర్తించారు. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం వారిని అరెస్టు చేసి, స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచారు. ట్రాన్సిట్ వారంట్ నగరానికి తీసుకొచ్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి ఆరు ఫోన్లు, ల్యాప్‌టాప్, 5 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు సోమవారం కస్టడీకి పిటీషన్ దాఖలు చేయనున్నట్లు డీసీపీ తెలిపారు.

డ్రగ్స్ ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో డ్రగ్స్ విక్రేతలను అరెస్టు చేశారు. గచ్చిబౌలి సీఐ జేమ్స్ బాబు తెలిపిన ప్రకారం..యూసూఫ్‌గూడకు చెందిన సులేమాన్ అబుబాకర్ అలియాస్ వాసిమ్, హుమాయున్‌నగర్‌కు చెందిన షేక్ అర్మన్, బంజారాహిల్స్‌కు చెందిన అర్కమ్ హుస్సేన్ రెండేళ్లుగా బెంగళూర్, గోవా నుంచి డ్రగ్ తీసుకొచ్చి పబ్‌లలో విక్రయిస్తున్నారు. నోవాటెల్ అర్బిస్ట్రీ, ఎయిర్ లైవ్ పబ్, క్లబ్‌రాక్‌లో కొకైన్ గ్రాము రూ.15 వేలు, గ్రాము ఎండీఎంఏ రూ.8 వేలకు విక్రయించారు. ఈ క్రమంలో క్లబ్‌లో నిజాంపేట్‌లో నివాసం ఉండే మిథున్ అనే మహిళతో సులేమాన్‌కు పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడటంతో డ్రగ్‌ను ఆమెకు ఉచితంగా ఇచ్చేవాడు. ఆమెతో పాటు వారి స్నేహితులకు డ్రగ్ విక్రయించేవారు. ఈ క్రమంలో విభేదాలు రావడంతో సులేమాన్ మిథున్‌ను వేధించడం మొదలుపెట్టాడు. ఓ వైపు ఆరోగ్యం క్షీణించడం, మరోవైపు వేధింపులు తట్టుకోలేక ఆమె బాచుపల్లి షీ టీంను ఆశ్రయించింది. వారి సూచనలతో టీఎస్ న్యాబ్ సిబ్బందిని ఆశ్రయించింది. జనవరి 30న బెంగళూర్‌కు వెళ్లిన సులేమాన్, అబుబాకర్‌లు అజీం అనే వ్యక్తి వద్ద 10 గ్రాముల కొకైన్, 13 గ్రాముల ఎండీఎంఏ కొనుగోలు చేశారు. ఫిబ్రవరి 2న మిథున్ రెండు గ్రాముల కొకైన్ కావాలని ఆర్డర్ చేసింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మైహోం విహంగ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మిథున్‌కు రెండు గ్రాముల కొకైన్ అందజేశారు. అప్పటికే మాటు వేసి ఉన్న టీఎస్ న్యాబ్, ఎస్‌వోటీ, గచ్చిబౌలి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.26 లక్షల విలువ చేసే 10 గ్రాముల కొకైన్, 13 గ్రాముల ఎండీఎంఏ, స్కోడా, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు సులేమాన్, అర్మన్, అర్కమ్, మిథున్‌లను అరెస్ట్ చేశారు. మిథున్‌తో పాటు డ్రగ్ కొనుగోలు చేసేందుకు వచ్చిన కేపీహెచ్‌బీకి చెందిన కొనగళ్ల ప్రియ, బంజారాహిల్స్‌కు చెందిన డాక్టర్ చల్లా చైతన్యలకు '41' నోటీసులు జారీ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

అధిక లాభాల పేరిట కుచ్చుటోపీ

సాక్షి, హైదరాబాద్: అధిక లాభాలు ఆశ చూపించి అమాయకులను మోసం చేస్తున్న ఎక్స్‌ఐటీఓ కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఎక్స్‌సీఎస్‌పీఎల్) కంపెనీ డైరెక్టర్ బీఎస్ సతీష్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..బెంగళూరుకు చెందిన సతీష్, అవలకొండప్ప వెంకటచలపతి అనే వ్యక్తితో కలిసి 2015లో బెంగళూరులో ఎక్స్‌సీఎస్‌పీఎల్ పేరుతో కంపెనీ ప్రారంభించారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు చెందిన గాదిరాజు రాజేంద్రప్రసాద్ రాజు, గురు ప్రసాద్, పాసం వెంకట్ ప్రసాద్, జ్యోతిలతో కలిసి కేపీహెచ్‌బీలోని మంజీరా ట్రినిటీలో బ్రాంచ్ ఆఫీసును ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది సామన్యుల నుంచి రూ.2 కోట్లు డిపాజిట్లు వసూలు చేశారు. ఆ తర్వాత పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

అపోలో కేన్సర్ ఆస్పత్రిలో 'విక్టరీ బెల్'



విక్టరీ బెల్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు

బంజారాహిల్స్: అపోలో కేన్సర్ ఆస్పత్రిలో 'విక్టరీ బెల్'ను మంత్రి శ్రీధర్‌బాబు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేన్సర్ రోగులు అధైర్యపడొద్దన్నారు. ఆత్మవిశ్వాసమే కొండంత బలమని సూచించారు. అపోలో హాస్పటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా విక్టరీ బెల్‌ను ఆవిష్కరించడం ముఖ్యమైన ఘట్టంగా అభివర్ణించారు. ఇది ఆస్పత్రిలోని ఆంకాలజీ యూనిట్లలో జరిగిన పోరాటాలకే కాకుండా ప్రతి కేన్సర్ రోగి ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుందన్నారు. విజయం, పట్టుదల స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. అపోలో కేన్సర్ హాస్పటల్ డైరెక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ... విక్టరీ బెల్ నుంచి వచ్చే శబ్దం కేన్సర్‌ను జయించిన వ్యక్తి విజయాన్ని సూచిస్తుందన్నారు.

8,9 తేదీల్లో ఢిల్లీలో బీసీ సమరభేరి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ బీసీలకు తీవ్ర నిరాశ మిగిల్చిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. బీసీలపై కేంద్ర తీరును నిరసిస్తూ ఈ నెల 8, 9 తేదీలలో ఢిల్లీలో జరిగే బీసీల సమర భేరి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం రవీంద్రభారతిలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కె.గణేష్ చారి ఆధ్వర్యంలో బీసీల సమర భేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి బీసీ ప్రధాని ఉన్నప్పటికీ బడ్జెట్‌లో తమకు మొండిచేయే మిగిలిందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బి.బాల్‌రాజ్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ తదితరులున్నారు.

అమెరికా నుంచి వచ్చి.. యువతిని వేధించి..

కటకటాల పాలైన ఓ కంపెనీ సీఈఓ

వెంగళరావునగర్: తన సంస్థలో విధులు నిర్వహిస్తున్న యువతి కోసం అమెరికా నుంచి వచ్చిన ఓ సీఈఓ..ఆమెను వేధించి కటకటాల పాలైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీర్‌పేటలో ఉన్న ఇన్ఫోగ్రావిటీ సంస్థ సీఈఓ టి.చంద్ర అమెరికాలో ఉంటాడు. ఇండియాలో తన కంపెనీ అభివృద్ధిలో భాగంగా నిరంతరం జూమ్ సమావేశాలు ఏర్పాటు చేసి ఉద్యోగులకు సలహాలు, సూచనలు ఇస్తుంటాడు. ఈ క్రమంలో తన కంపెనీలో (అమీర్‌పేట సంస్థ)లో హెచ్ఆర్‌గా విధులు నిర్వహిస్తున్న యువతిని జూమ్ సమావేశంలో చూశాడు. అంతేగాకుండా ఆమెపై మనసు పారేసుకున్నాడు. తన కంపెనీ అభివృద్ధి కోసం అందమైన అమ్మాయిలకు ఉద్యోగాలు ఇవ్వాలని సూచించడమే కాకుండా ఆమెను నిత్యం పొగిడేవాడు. అయితే అతను తన యజమాని కావడంతో యువతి ఏమీ అనలేక పోయింది. గతేడాది డిసెంబర్‌లో ఇండియాకు వచ్చిన చంద్ర ఆ యువతిని వేధించడం మొదలుపెట్టాడు. తనతో సన్నిహితంగా ఉండాలని ఒత్తిడి చేశాడు. దీంతో విసుగుచెంది అదే నెల 12న ఉద్యోగానికి రాజీనామా చేసింది. తనకు రిలీవింగ్ లెటర్, జీతం, లీగల్ సర్వీసెస్ డ్యూస్, ఎక్స్‌పీరియన్స్ లెటర్స్ కావాలని కోరింది. అయితే తన కోర్కె తీరిస్తేనే వాటిని ఇస్తానని చంద్ర చెప్పడంతో ఆమె ఆగ్రహించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుమారి ఆంటీ హోటల్ రీ ఓపెన్

గచ్చిబౌలి: ఎట్టకేలకు కుమారి ఆంటీ హోటల్ తెరుచుకుంది. ఐటీ కారిడార్‌లో కోహినూర్ హోటల్ ఎదురుగా ట్రాఫిక్ జాం నెలకొనడంతో కుమారి ఆంటీ హోటల్‌ను ఇటీవల రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు తొలగించడంతో వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో కుమారి ఆంటీ హోటల్ తొలగింపు వైరల్ కావడంతో సీఎం కార్యాలయం స్పందించింది. ఈ హోటల్‌ను అదే స్థలంలో నడుపుకోవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ అధికారులను ఆదేశించడంతో వివాదానికి తెరపడింది.


భోజనం వడ్డిస్తున్న కుమారి ఆంటీ

జిల్లా వార్తలు


ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: దివ్యాంగులకు చేయూత నిస్తున్న ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఖమ్మం జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. ఖమ్మంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన 25 మంది దివ్యాంగులకు రూ.3 లక్షల విలువైన వీల్ చైర్స్, బీటెక్ చదువుతున్న పేద విద్యార్థినికి రూ.50 వేల విలువైన ల్యాప్‌టాప్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు, విద్యార్థులు, మహిళలకు ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ఆధ్వర్యాన అండగా నిలుస్తుండడం అభినందనీయమని తెలిపారు. ఎన్నారై ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బయ్యన బాబురావు, అధ్యక్ష, కార్యదర్శులు బోనాల రామకృష్ణ, బండి నాగేశ్వరరావు, కార్పొరేటర్ మిక్కిలినేని మంజులతో పాటు మిక్కిలినేని నరేంద్రచౌదరి, పసుమర్తి రంగారావు, కొంగర పురుషోత్తమరావు, కురివెళ్ల ప్రవీణ్, అన్నం శ్రీనివాసరావు, వాసిరెడ్డి శ్రీనివాస్, కళ్యాణపు సాంబశివరావు, జ్యోతి, పద్మిని, వాసిరెడ్డి అర్జునరావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జెన్‌కో హాకీ, బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ: పాల్వంచలోని విద్యుత్ కళాభారతి క్రీడా మైదానంలో కేటీపీఎస్ 5, 6వ దశల స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ హాకీ, బాస్కెట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్, జూరాల, విద్యుత్ సౌధ నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈమేరకు పోటీలను ప్రారంభించిన సీఈ ఎం.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులు విధినిర్వహణతో పాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా చురుకుదనం పెరుగుతుందని తెలిపారు. యాజమాన్యం తరుపున క్రీడాకారులకు సహకారం ఉంటుందని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎస్ఈలు మోక్షవీర్, శ్రీనివాసరావు, రామారావు, జెన్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్, స్పోర్ట్స్ సెక్రటరీలు తంబళ్ల వీరస్వామి, వై.వెంకటేశ్వర్లు, నరసింహా, రాజు, కట్టా శ్రీధర్, బరగడ రామారావు, డోలి శ్రీను, రవిబాబు, తోట అనిల్, మహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రానికి 'కళ'

- భద్రాద్రిలో నేటి నుంచి అంతర్రాష్ట్ర నాటక పోటీలు
- వివిధ రంగాల్లో కళాకారులకు సత్కారాలు
- 23 ఏళ్లుగా ఆనవాయితీ కొనసాగిస్తున్న 'కళాభారతి'

భద్రాచలంటౌన్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి క్షేత్రం రామయ్య కొలువైన నేలగానే కాకుండా కళలకు కాణాచిగానూ నిలుస్తోంది. భద్రాచలం పేరు వినగానే కళల పండుగకు వేదికగా నిలుస్తున్న 'భద్రాద్రి కళాభారతి' సైతం గుర్తుకొస్తుంది. కళలను ప్రదర్శించడమే కాకుండా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళారంగాల్లో ప్రముఖులను భద్రాచలం రప్పించి రామయ్య సన్నిధిలో పూజలు చేయించాక అతిథి మర్యాదలతో సత్కరించడం సంప్రదాయంగా వస్తోంది. దీన్ని 'భద్రాద్రి కళాభారతి' నిర్వాహకులు ఆనవాయితీగా కొనసాగిస్తూ అంతరించిన పోతున్న నాటకరంగానికి ఊపిరిలూదుతున్నారు. కళాకారులను నలుగురికి పరిచయం చేస్తూ ఏటా నిర్వహించే ఉత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి.

చిరుద్యోగులతో 'కళాభారతి'

భద్రాచలం ఆర్టీసీ డిపో చిరుద్యోగుల మదిలో మెదిలిన ఆలోచనతో భద్రాద్రి కళాభారతి ప్రాణం పోసుకుంది. ఈ సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న అల్లం నాగేశ్వరరావు స్వతహాగా కళాకారుడు, దీంతో సహద్యోగులు, కళాకారులైన నర్సింహారావు, రామరాజు శ్రీనివాస్, ప్రతాప్, తిరుపతి, పులిరాజుతో కలిసి నాటిక, నాటక రంగాల్లో కళాకారులను తీర్చిదిద్దాలని, ఆ రంగానికి మరింత ప్రాచుర్యం తీసుకురావాలని 2001 ఆగస్టు 21న భద్రాద్రి కళాభారతిని ప్రారంభించారు. అప్పటి నుంచి ఏటా భద్రాచలంలో పండుగలా నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు. అంచెలంచెలుగా పలువురి ఆర్థిక సహకారంతో 2003 నుంచి అంతర్రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు నిర్వహించడం మొదలుపెట్టారు. ఇప్పటి వరకు సుమారు వందకు పైగా


అంతర్రాష్ట్ర నాటకోత్సవాల్లో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు (ఫైల్)

నాటికలు ప్రదర్శిమవగా, ఎందరో వర్ధమాన కళాకారులు కళాభారతి ద్వారా వెలుగులోకి రావడం విశేషం. ఈ నాటకోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల కళాకారులు హాజరవుతున్నారు.

కళాకారులకు సత్కారం

కేవలం నాటికల ప్రదర్శనకే పరిమితం కాకుండా జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ, ఇంద్రజాలం వంటి ప్రదర్శనలు ఇప్పిస్తూ ఆయా రంగాల కళాకారులు, సినీ, టీవీ నటులను ఘనంగా సత్కరిస్తున్నారు. కళాతపస్వి కె.విశ్వనాథ్, సుద్దాల అశోక్‌తేజ, నూతనప్రసాద్, ఎల్‌బీ.శ్రీరాం, తనికెళ్ల భరణి, గుండు హనుమంతురావు, చంద్రబోస్, జయప్రకాష్ రెడ్డి, ఘంటాడి కృష్ణ, తెలంగాణ శకుంతల, శివశంకర్ మాస్టారు, ఏవీఎస్, గోరేటి వెంకన్న, జయరాజు, మధుప్రియ, హీరో శ్రీకాంత్, దేశపతి శ్రీనివాస్, ఆర్.నారాయణమూర్తి, రేలంగి శ్రీనివాసరావు తదితరులు ఎందరో ఈ వేదికపై సత్కారం అందుకున్నారు.

నేటి నుంచి మూడు రోజుల పండుగ

భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు కళల పండుగ జరగనుంది. ఈ మూడు రోజుల పాటు జిల్లాతో పాటు కరీంనగర్, గుంటూరు, కొలకలూరు తదితర ప్రాంతాల కళాకారుల నాటిక ప్రదర్శనలే కాక శాస్త్రీయ, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు జరగనున్నాయి. అలాగే, సినీ నటుడు పృథ్వీరాజ్, గాయకులు పార్వతి, శంకర్ బాబు తదితరులకు సన్మానించనున్నారు.

నాటక రంగాన్ని కాపాడుకోవాలనే తపనతో..



తెలుగు రాష్ట్రాల్లో నాటక రంగాన్ని కాపాడడం, వర్ధమాన కళాకారులను వెలుగులోకి తీసుకురావాలన్న తపనతో భద్రాద్రి కళాభారతిని స్థాపించాం. అభిమానులు, పట్టణ పుర ప్రముఖుల సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నారు. రామయ్య సన్నిధిలో ఈ నాటకోత్సవాలను నిర్వహించే అవకాశం దక్కడాన్ని అదృష్టంగా భావిస్తున్నాం.

– అల్లం నాగేశ్వరరావు, కళాభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు

రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న హరీశ్‌రావు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తొలుత మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, తాతా మధు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, సండ్ర వెంకటవీరయ్య స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం త్రిదండి చినజీయర్ స్వామి రాగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా జీయర్‌స్వామి భక్తులకు ప్రసాదం, ఆశీస్సులు అందచేశారు.


భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న చినజీయర్ స్వామి

మామిడితోటల్లో తెగుళ్లు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, చుంచుపల్లి, చంద్రుగొండ, సుజాతనగర్, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో మామిడి తోటలను కొత్తగూడెం కేవీకే శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా తోటలను ఆశించిన తెగుళ్లను గుర్తించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2ఎం.ఎల్.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే,బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 2గ్రా.ను కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. రైతులు పండు ఈగ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. కాగా, ఫ్రూట్ బ్యాగింగ్ చేయడం, కార్బయిడ్ రహితంగా మాగించడం వంటి మేలైన పద్ధతులు, కోత అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నవీన్, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, డాక్టర్ బి.శివ తదితరులు పాల్గొన్నారు.


మామిడితోటల పరిశీలనలో అధికారులు, శాస్త్రవేత్తలు

అనర్హత ఉత్తర్వులు రద్దు చేయండి

డీసీఎంఎస్ ఛైర్మన్ వ్యవహారంపై ట్రిబ్యునల్ ఉత్తర్వులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ పదవీ వ్యవహారంపై తెలంగాణ కోఆపరేటివ్ ట్రిబ్యునల్ వరంగల్ కోర్టు ఉత్తర్వులు విడుదల చేసింది. వ్యక్తిగత రుణ వ్యవహారంలో డీసీఎంఎస్ చైర్మన్, తల్లాడ మండలం గంగదేవిపాడు పీఏసీఎస్ చైర్మన్ రాయల వెంకటశేషగిరి రావుపై వేసిన అనర్హత వేటు ఉత్తర్వులను రద్దుచేయాలని జిల్లా సహకార అధికారిని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది. ఆయన డీసీసీబీ నుంచి రూ. 27 లక్షల మేర వాహన రుణం తీసుకుని బకాయి పడడంతో అధికారులు నోటీసులు జారీ చేశాక కారును జప్తు చేశారు. అనంతరం బకాయి కలిగి ఉండడంతో నిబంధనలకు మేరకు ఆయనను పదవి నుంచి తొలగించి డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అయిన కొత్వాల శ్రీనివాసరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. దీంతో శేషగిరిరావు వరంగల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా అనర్హత ఉత్తర్వులను రద్దు చేయాలని ఆదేశించింది. దీంతో ఆయన శనివారం ఖమ్మం డీసీఎంఎస్ కార్యాలయానికి వచ్చి డైరెక్టర్లు తోళ్ల కోటయ్య, మారుతి యట్టయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాను అనారోగ్యంతో ఉన్న సమయాన రుణబకాయిలు చెల్లించాలని నోటీసులు ఇవ్వడమే కాక జప్తు చేశారని తెలిపారు. ఆ వెంటనే తాను బకాయి చెల్లించినా పదవుల నుంచి తొలగించడంతో ట్రిబ్యునల్‌ను ఆశ్రయించానని పేర్కొన్నారు. ఈమేరకు అనర్హత ఉత్తర్వులను రద్దు చేయాలని డీసీఓను ట్రిబ్యునల్ ఆదేశించిందన్నారు. కాగా, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన అధికారులు రాజకీయ నాయకుల మెప్పు కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.


ట్రిబ్యునల్ ఉత్తర్వులను చూపిస్తున్న రాయల శేషగిరిరావు

పూర్తి వివరాలు కోర్టుకు సమర్పిస్తాం...

డీసీఎంఎస్ చైర్మన్, గంగదేవిపాడు పీఏసీఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు రుణ బకాయి ఉండడంతో చట్టప్రకారం అనర్హత వేటు వేశామని ఖమ్మం జిల్లా సహకార అధికారి ఏ.విజయకుమారి తెలిపారు. దీంతో ఆయన హైకోర్టును, ఆతర్వాత వరంగల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారని పేర్కొన్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈనెల 7న కౌంటర్ ఫైలు దాఖలు చేస్తామని తెలిపారు. ఇదేవిషయమై చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పదవులు కోల్పోయిన శేషగిరిరావు అధికారికంగా ఆదేశాలు రాకముందే చైర్మన్ కుర్చీలో కూర్చోవడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని తెలిపారు.

5న కొత్తగూడెంలో రెజ్లింగ్ పోటీలు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 5న జిల్లాస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. కొత్తగూడెం త్రీఇంక్‌లైన్ పరిధిలోని తెలంగాణ క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్ తెలిపారు. ఈ పోటీలు అండర్–12, 15, 17 విభాగాల్లో జరగనుండగా, బాలబాలికలు ఆధార్‌కార్డులో ఉదయం 9గంటల లోపు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాల కోసం 83095 29743 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.